క్లుప్తంగా

8 నుంచి మారెమ్మ జాతర

కడప కల్చరల్ : కడప నగరం 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లెలోని శ్రీ మారెమ్మ తల్లి ఆలయ 19వ వార్షికోత్సవం శని, ఆదివారాలలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం అమ్మవారికి గణపతిపూజ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహిస్తారు. అదేరోజు రాత్రి అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం అమ్మవారికి బోనాల సమర్పణ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బండలాగుడు పోటీలు నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఈ పోటీలు కొనసాగుతాయి.

ఆర్టీసీ బస్సుల్లో తెలుగుదనం

కడప కల్చరల్ : ఆర్టీసీ బస్సుల్లో తెలుగుదనం కనిపించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధికారభాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య కోరారు. గురువారం ఆయన ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డిని కడప నగరంలోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలోని బస్సుల బోర్డులు తెలుగులో ఉండడంపై హర్షం వ్యక్తం చేశారు. బస్సుల్లో ఇంకా తెలుగుదనం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని వివరించారు.

చిరుధాన్యాలతో రోగ నిరోధక శక్తి

కడప ఎడ్యుకేషన్: రోగనిరోధక శక్తిని బలోపేతం చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో చిరుధాన్యాలను భాగంగా చేసుకోవాలని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ రవీంద్రనాథ్ అన్నారు. 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించిన సందర్భంగా కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లచే అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారి, లెఫ్టినెంట్ డాక్టర్ నీలయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ మహేష్, క్యాడెట్లు పాల్గొన్నారు.

29 నుంచి డీవైఎఫ్‌ఐ శిక్షణ తరగతులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: బద్వేలులో ఈ నెల 29,30 తేదీల్లో నిర్వహిస్తున్న డీవైఎఫ్‌ఐ రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ రాజకీయ శిక్షణ తరగతుల్లో నిరుద్యోగుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో తెలిపిన విధంగా జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి కేంద్రం ఒక్క రూపాయి కూడ నిధులు ఇవ్వలేదన్నారు. కేంద్రపై రాష్ట్ర ప్రభుత్వం పోరాటాలు చేసి నిర్ణీత గడువులోగా కడప ఉక్కును పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు ఓబులేసు, రాజ్‌కుమార్, శ్రీను పాల్గొన్నారు.

హమాలీల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: పౌరసరఫరా శాఖలో పని చేస్తున్న హమాలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి కోరారు. ఈ విషయమై గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ సప్లయి కార్పొరేషన్ పరిధిలో మండల స్టాక్ పాయింట్లలో లోడింగ్, అన్ లోడింగ్ పనులు చేసుకుంటూ 36 సంవత్సరాలుగా పని చేస్తున్న హమాలీల కడుపు కొట్టే విధానాలకు స్వస్తి పలకాలన్నారు. పౌరసరఫరాలో డైరెక్ట్ మూమెంట్ పైలెట్ ప్రాజెక్టును రద్దు చేయాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరి కేసీ బాదుల్లా, సివిల్ సప్లయి హమాలీలు పాల్గొన్నారు.

పోస్టులను భర్తీ చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగా సురేష్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని గ్రామ, వార్డు, సచివాలయ ఉద్యోగాలకు, ఏపీపీఎస్సీ, గ్రూప్–2, డీఎస్సీ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీగా ఉన్న రెండు లక్షల ముప్పై వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పి ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం సరికాదన్నారు. గ్రామ వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న 14 వేల పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగవకాశాలు కల్పించాలని కోరారు. దస్తగిరి, దేవ రాహుల్, చైతన్య పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం


రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ రామ్‌చరణ్‌రెడ్డి

కడప రూరల్: అవగాహనతోనే మెరుగైన ఆరోగ్యం చేకూరుతుందని డాక్టర్ డి.రామ్‌చరణ్ రెడ్డి తెలిపారు. ఎస్‌వీ గ్యాస్ట్రో అండ్ లివర్ క్లినిక్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఆ క్లినిక్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి వచ్చిన రోగులకు జీర్ణకోశ, లివర్, పాంక్రియాస్ తదితర వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన గుడ్ ఫ్రైడే ప్రార్థనలు



ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు (ఇన్‌సెట్) దైవ సందేశం అందజేస్తున్న ఫాదర్ రాజా

కడప కల్చరల్ : గుడ్‌ఫ్రైడే కార్యక్రమాలు గురువారం నుంచే ప్రారంభమయ్యాయి. ముందస్తు కార్యక్రమాల్లో భాగంగా మరియాపురంలోని క్యాథడ్రల్ చర్చి ఆవరణలో ఫాదర్ రాజా 12 మంది శిష్యుల పాదాలను కడిగారు. ఏసుక్రీస్తు తన శిష్యుల పాదాలను కడిగిన ఘట్టాన్ని గుర్తు చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక భక్తులు పెద్ద ఎత్తున కార్యక్రమానికి హాజరయ్యారు. కడప నగరం రైల్వేస్టేషన్ వద్దగల ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో కడరాత్రి భోజన ప్రత్యేక దివ్యబలి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ క్షేత్రం డైరెక్టర్ ఫాదర్ పి.అబ్రహం 12 మంది శిష్యుల పాదాలను కడిగారు. ఈ సందర్భంగా ఫాదర్ అబ్రహం మాట్లాడుతూ సమాజానికి సేవకుడిలా పనిచేసిన వారే నిజమైన నాయకుడన్నారు. తనను తాను తగ్గించుకునువాడే హెచ్చింపబడతాడని ఆయన తెలిపాడన్నారు. నాయకుడన్న వాడు క్రీస్తు ప్రభువు నుంచి నాయకత్వ లక్షణాలను నేర్చుకోవాలన్నారు.

నేడు శుభ శుక్రవార ఆరాధనలు

గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని కడప నగరంలోని అన్ని చర్చిలలో ప్రత్యేకంగా శుభ శుక్రవార ఆరాధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కడప నగరంలోని మరియాపురం, సీఎస్‌ఐ మైదానం, ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంతోపాటు మిగతా అన్ని చర్చిలలో విశేష ప్రార్థనలు నిర్వహించనున్నారు. స్థానిక మరియాపురంతోపాటు కొన్ని చర్చిల వద్ద ఉదయం 10 నుంచి 12 గంటల వరకు శిలువ మార్గం పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా గురువులు, భక్తులు క్రీస్తు శిలువను మోసిన ఘట్టాన్ని గుర్తుకు తెస్తూ తాము కూడా శిలువను మోస్తారు. సాయంత్రం 5 గంటల నుంచి ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

● **సీఎస్‌ఐ సెంట్రల్ చర్చిలో ...**

స్థానిక సీఎస్‌ఐ సెంట్రల్ చర్చిలో ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ గురువులు ప్రభువు శిలువపై శిక్షింపబడిన సందర్భంగా పలికిన ఏడు మాటలపై ధ్యానం కార్యక్రమం నిర్వహిస్తారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఆదివారం ఈస్టర్ సండే సందర్భంగా క్రీస్తు పునరుత్థాన శుభ ఘడియలను పురస్కరించుకుని ఉదయం 5 గంటల నుంచి చర్చిలో ప్రత్యేక సర్వీసు ఉంటుంది. ఇందులో బిషప్ పాల్గొంటారు.

● **ఆరోగ్యమాత చర్చిలో ...**

గుడ్‌ఫ్రై డే సందర్భంగా కడప నగరం రైల్వేస్టేషన్ వద్దగల ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు చర్చి ఆవరణలో శిలువ మార్గం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా క్రీస్తు పలికిన చివరి ఏడు మాటలు, తపస్కాల దీక్షల విరమణ నిర్వహిస్తారు. రాత్రి 11 గంటలకు దివ్య బలిపూజ ఉంటుంది.

ప్రజలు మెరుగైన ఆరోగ్యంతో జీవించాలి

● సీనియర్ సివిల్ జడ్జి కవిత


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కవిత

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రజలందరూ మెరుగైన ఆరోగ్యంతో జీవించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కవిత తెలిపారు. గురువారం నగర శివార్లలోని చౌడమ్మ వృద్ధాశ్రమంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ సిటిజన్స్‌కు వైద్య శిబిరం, న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా ప్రజలందరూ ఆరోగ్యంగా జీవించాలనేదే ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ ఏడాది అందరికీ ఆరోగ్యం అనే నినాదంతో 68వ ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు టోల్‌ఫ్రీ నెంబరు 14567పై అవగాహన కల్పించారు. అలాగే నల్సా పథకం–2016 గురించి తెలియజేశారు. ఆ తర్వాత సీనియర్ సిటిజన్స్‌కు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి షుగర్, బీపీ ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఐరన్, క్యాల్షియం, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

సమతుల ఆహారం తీసుకోవాలి

ప్రతి ఒక్కరూ సమతుల ఆహారం తీసుకుని శారీరక వ్యాయామంతో పాటు యోగ, ధ్యానం లాంటి అలవర్చుకోవాలని కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఏప్రిల్ 7వ తేదిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా అందరికీ ఆరోగ్యం అనే పిలుపు నేపథ్యంలో నగర శివార్లలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్పొరేటర్ అంకమ్మ, సీనియర్ వైద్యులు వెంకట నాయుడు, చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్: మానవుడి దైనందిన జీవితం కాలంలో అనారోగ్యానికి గల కారణం ఆహార అలవాట్లేనని ఆర్య న్యూరో కేర్ వైద్యులు సాయికిరణ్ పేర్కొన్నారు. గురువారం కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల హెల్త్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో హెల్త్ ఫర్ ఆల్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయికిరణ్ పలు సూచనలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ విజయదుర్గాలయంలో పౌర్ణమి పూజలు


ఆలయం చుట్టూ కలశాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా విశేష పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున పుణ్యనదీ జలాలతో నింపిన తొమ్మిది కలశాలను ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్, వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు ఆలయం చుట్టూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. మంగళ వాయిద్యాల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో తొమ్మిది మంది దంపతులు ఇతర భక్తులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి మూలమూర్తికి కలశాలలోని పవిత్ర జలంతో ప్రత్యేకంగా నవకలశ స్నపనం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణిభూషణశర్మ ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. సాయంత్రం 108 మంది ముత్తయిదువులు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో 108 దీపాలను వెలిగించి అష్టోత్తర శతదీపాలంకార సేవ నిర్వహించారు. రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు.

నిబద్ధతతో ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించాలి

● ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా


నియామక పత్రాలు అందుకున్న వారితో డిప్యూటీ సీఎం

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిబద్ధతతో పని చేస్తూ కుటుంబాలకు ఆసరాగా నిలవాలని డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా తెలిపారు. గురువారం సాయంత్రం డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కడప అర్బన్ పరిధిలో ఆరు అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించి ఆరు అంగన్వాడీ సహాయకురాళ్లకు డిప్యూటీ సీఎం నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు ఎంపికైన అంగన్వాడీ సహాయకురాళ్లు సక్రమంగా విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా ఎంపికైన మరియాపురం–2 గురువాణి, మారుతీనగర్–2 బి.రాణి, శాస్త్రినగర్–1 ఎస్.కరీష్మా, ఎల్‌ఐజీ కాలనీ డి.శ్రీవాణి, వికలాంగుల కాలనీ జి.వెంకట సుబ్బయ్య, భగత్‌సింగ్ నగర్ పి.జ్యోతిలకు నియామక పత్రాలను అందజేశారు.కార్పొరేటర్లు బాలస్వామిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, త్యాగరాజు, రామచంద్రయ్య, శ్రీదేవి, సీడీపీఓ సునంద, వైఎస్సార్ సీపీ నాయకులు తోట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు బండలాగుడు పోటీలు

కమలాపురం : పట్టణంలో వెలసిన శ్రీహజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి ఉరుసు మహోత్సవాలను పురస్కరించుకుని దర్గా మైదానంలో శుక్రవారం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల దంతాల ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనదలిచిన వారు దర్గా–ఏ–గఫారియా ఆఫీసులో లేదా 97011 23459, 81219 96786 నెంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని వారు కోరారు.

రక్షణ పైపులను అమర్చాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని రిమ్స్‌కు వెళ్లే దారిలో డెంటల్ కళాశాల అనుకొని ఉన్న మురికి కుంట చుట్టూ రక్షణ పైపులను ఏర్పాటు చేయాలని ఆర్‌సీపీ నగర కార్యవర్గ సభ్యులు రమేష్ కోరారు. గురువారం ఆర్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాత్రి సమయాల్లో నీటి కుంట కనపడకపోవడంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతోందనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణగా పైపులను అమర్చాలన్నారు. రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరగకుండా రేడియం స్టిక్కర్లను అతికించాలన్నారు.

‘జగనన్నే మా భవిష్యత్’ సర్వేను పక్కాగా నిర్వహించాలి


సర్వే కిట్‌ను అందజేస్తున్న కార్పొరేటర్ కె. సూర్యనారాయణ రావు

కడప కార్పొరేషన్: ‘జగనన్నే మా భవిష్యత్ సర్వేను పక్కాగా నిర్వహించాలని 25వ డివిజన్ కార్పొరేటర్ కె. సూర్యనారాయణ రావు అన్నారు. గురువారం స్థానిక నెహ్రూ పార్కు సమీపంలోని వార్డు సచివాలయంలో ఆయన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ రావు మాట్లాడుతూ కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ఈ సర్వే నిర్వహించాలన్నారు. ఈనెల 7న మొదలు పెట్టి 20వ తేదికి పూర్తి చేయాలని తెలిపారు.

30వ డివిజన్‌లో... కడప నగరంలోని 30వ డివిజన్ వార్డు సచివాలయంలో కార్పొరేటర్ ఎస్‌ఎండీ షఫీ ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ షఫీ మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి పదిహేను నిముషాలు వారితో గడిపి సర్వే చేయాలన్నారు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారికి డోర్, మొబైల్ స్టిక్కర్లు ఇచ్చి, వారితో మిస్డ్ కాల్ ఇప్పించాలన్నారు.

శ్వేత హాస్పిటల్‌లో వినికిడి పరీక్షలు ప్రారంభం

కడప అర్బన్: శంకరాపురంలోని శ్వేత హాస్పిటల్‌లో ప్రముఖ ఈఎన్‌టీ వైద్యనిపుణులు ప్రశాంత భరత్ రెడ్డి, డాక్టర్ శ్వేతల ఆధ్వర్యంలో గురువారం ఆడియాలజిస్ట్ మధుసూదన్‌రెడ్డి హియరింగ్ సెంటర్‌ను ప్రారంభించారు.వినికిడి పరీక్షల సేవలతో పాటు, వినికిడి మిషన్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈనెల 9న ఉచితంగా వినికిడి పరీక్షలను చేస్తామని.. రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం

● 2024 ఎన్నికల్లో 87శాతం ఓట్లతో వైఎస్ జగన్ తిరిగి అధికారంలోకి వస్తాడు

● వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


డ్వాక్రా మహిళలకు మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : మహిళాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా వారోత్సవాలలో ఆయన సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలసి పాల్గొని మాట్లాడారు. 2024 ఎన్నికల్లో 87శాతం ఓట్లతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి అధికారంలోకి రావడం తథ్యం అని ఆయన జోస్యం చెప్పారు. రాష్ట్రంలో 87శాతం ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. 2012లో చంద్రబాబు పాదయాత్ర చేపట్టి డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని, మీరంతా రుణాలు చెల్లించవద్దని ప్రచారం చేశాడన్నారు. 2014లో అధికారం చేపట్టే నాటికి డ్వాక్రా రుణాలు రూ.14వేల కోట్లుండేదన్నారు. చంద్రబాబు మాట తప్పి రుణాలు మాఫీ చేయకపోవడంతో అది వడ్డీతో కలిపి 2019 నాటికి రూ.28వేల కోట్లకు పెరిగిందన్నారు. చంద్రబాబు రుణాలు రద్దు చేయకపోతే కడపలోని తన హోటల్ అమ్మి అయినా సరే డ్వాక్రా, బంగారు రుణాలు మాఫీ చేస్తానని స్థానిక నాయకుడు అన్నాడని, ఆయన హోటల్ అమ్మకం ఎంత వరకు వచ్చిందని ప్రశ్నించాలన్నారు. జగనన్న మహిళలు అభివృద్ధి చెందితేనే వారి కుటుంబం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని గ్రహించి వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రవేశ పెట్టారని కొనియాడారు. నాలుగు విడతల్లో రూ.25,600 కోట్లు నిధులను మహిళల ఖాతాలకు జమ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజుల రెడ్డి ప్రసంగించారు. అనంతరం డ్వాక్రా మహిళలకు రూ.6,53,29,911 మెగా చెక్కును ఎమ్మెల్యే మహిళలకు అందజేసి జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, ఎంపీపీ గండి భారతి, జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మార్పూరి మేరి, మండల తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీఓ చలపతి, మండల స్పెషలాఫీసర్ నరసింహారెడ్డి, కమిషనర్ రాజశేఖర్, వెలుగు ఏపీ రఘునాథరెడ్డి, ఏపీఎం అపర్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, చెన్నకేశవరెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, కొండారెడ్డి, గంగాధర్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, నాగేంద్రారెడ్డి, చెన్నకేశవరెడ్డి, హిదాయత్ పాల్గొన్నారు.

వైభవం.. హనుమత్ విజయోత్సవం

రాజుపాళెం : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలో గురువారం హనుమత్ విజయోత్సవ కార్యక్రమాన్ని ఆలయ చైర్‌పర్సన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. మందుగా చెన్నకేశవ, సంజీవరాయ స్వాములకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన ఒంటి వాహనంపై సంజీవరాయ స్వామిని ఆశీనులు చేసి ఆలయంలోని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు టెంకాయలు కొట్టి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శివరామసుబ్బారెడ్డి, కానాల రామచంద్రారెడ్డి, సుదర్శనరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద వివిధ పోస్టుల భర్తీకిగాను గురువారం ఆర్‌ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించారు. డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ గజలక్ష్మి ఆధ్వర్యంలో అభ్యర్థుల సర్టికెట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 2016 నుంచి 2019 మధ్యకాలంలో మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టనున్నామన్నారు. 40 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారన్నారు. వీరిలో జూనియర్ అసిస్టెంట్, ఆర్టీసీ కానిస్టేబుల్, డ్రైవర్లు, శ్రామిక్‌లుగా నియమించేందుకు తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. పీఓ రవి, సూపరింటెండెంట్ అల్లాబకష్, అసిస్టెంట్ మేనేజర్ జేసీ శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతో పాటు సంస్కారం నేర్చుకోవాలి

చింతకొమ్మదిన్నె : విద్యార్థులు చదువుతో పాటు సంస్కారం నేర్చుకోవాలని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని జె.కొత్తపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. విద్యార్థులు రెగ్యులర్ పాఠ్య పుస్తకాలే కాకుండా సమాజం గురించి చదవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్ కుమార్, సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘కెనరా ప్రీమియం పెరోల్ ప్యాకేజీ’ని సద్వినియోగం చేసుకోవాలి

కడప కార్పొరేషన్: కెనరా బ్యాంకు అందిస్తున్న ప్రీమియం పెరోల్ ప్యాకేజీని సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మురళీ అన్నారు. గురువారం కడప నగరానికి చెందిన వై. దీపకు కెనరా బ్యాంక్ మూలవంక బ్రాంచి వారు స్టాండప్ ఇండియా స్కీం కింద మంజూరు చేసిన హైర్ బస్సును ఆయన ఆ బ్రాంచి మేనేజర్ తల్లం ప్రవీణ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ ఉద్యోగుల కోసం కెనరా బ్యాంక్ ప్రీమియం పెరోల్ ప్యాకేజీని ప్రారంభించిందన్నారు. ఇందులో ప్రధానంగా మినిమమ్ బ్యాలెన్స్ అనే నిబంధన ఉండదన్నారు. అకౌంట్‌కు ఇన్సూరెన్స్ సదుపాయం ఉచితంగా లభిస్తుందని, ఎస్‌ఎంఎస్, నెఫ్ట్, ఐఎంటీఎస్‌లపై ఎలాంటి చార్జీలు ఉండవన్నారు. బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కేఎల్ఎం కళాశాలలో దంత వైద్య శిబిరం

కడప ఎడ్యుకేషన్: కేఎల్ఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రిన్సిపాల్ రత్నమ్మ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దంత వైద్యురాలు సుప్రియ గ్రేస్ దంత పరీక్షలను నిర్వహించి దంతాల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని తాళ్లమాపురం గ్రామాన్ని డాట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ మురళీకృష్ణ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వరి పొలాలను పరిశీలించి పంటలో ఎక్కువగా కాండం కుళ్లు తెగులుతోపాటు మెడవిరుపు తెగులు ఉందని తెలిపారు. రబీలో పంటను సకాలంలో వేయనట్లయితే ఎక్కువగా మెడ విరుపు తెగులు వస్తుందని అన్నారు. కాండం కుళ్లు తెగులు నివారణకు ఎకరాకి 400 ఎంఎల్ హెక్సాకేనజోల్ మందును పిచికారి చేయాలని సూచించారు. వేసవి కాలంలో సాగు చేసిన పంటలను నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతించిందని, రైతులందరూ వివరాలను వీఏఏ ద్వారా నమోదు చేయించుకోవాలని సూచించారు. పీఎంకిసాన్‌కు సంబంధించి రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేయించుకోవాలన్నారు. రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయాధికారి శివశైలజ, మండల వ్యవసాయాధికారి శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యపై అవగాహన

కడప ఎడ్యుకేషన్: ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యపై సీఆర్‌పీలు ఆదిమూలం శంకర్, వెంకట్రాది తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా గురువారం కడప నగరంలోని నిరంజన్ నగర్, శ్రీరామ్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్, ప్రాంతాలలోని అంగన్వాడీ కేంద్రాలలో తల్లిదండ్రులను కలిసి రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యపై అందించే విధానాన్ని సవిరంగా తెలియచేశారు. ఈ సదవకాశాన్ని పేద, బడుగు, బలహీన వర్గాల వారు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారు, దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని సూచించారు.